## ఒక్క ఓటు కూడా మిస్ కావొద్దు: పద్మా దేవేందర్ రెడ్డి




**దశ, మెదక్:** ఎస్ఐఆర్ పై అనుమానాలు ఉంటే ఎప్పటికప్పుడు పార్టీ నాయకులను, బీఎల్‌వోగా నియమించిన ఏజెంట్లను అడిగి తెలుసుకోవాలని మెదక్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వార్డులలో ఓట్లు మిస్ కాకూడదన్నారు. శుక్రవారం మెదక్‌లో ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సులో పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కొంతమంది బలవంతంగా ఓట్లు నమోదు చేస్తున్నారని ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐఆర్ అనే ప్రోగ్రాం కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించిందని, మనకు ఇచ్చిన సమయం లోపల కష్టపడి బీఎల్ఓలను కలిసి ఓట్లు మిస్ కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారుక్ హుస్సేన్, సుభాష్ రెడ్డి, కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మామిళ్ళ ఆంజనేయులు, మల్లికార్జున గౌడ్, బట్టి జగపతి, బట్టి ఉదయ్, సురేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ముహమ్మద్ అలీ, సంతు , ప్రదీప్, ఆర్కే శ్రీనివాస్, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎస్సై ,కానిస్టేబుల్ అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్



**దశ, రాయపోల్:** పోలీస్ శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రోత్సాహం అందించేందుకు శ్రీధర్ సీసీఈ, అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు అఖిల్ రాజ్ ఫౌండేషన్ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి తెలిపారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో ఎస్సై, కానిస్టేబుల్ స్కాలర్‌షిప్ టెస్ట్ గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు నగదు బహుమతులతో పాటు కోచింగ్ ఫీజులో ప్రత్యేక రాయితీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థికి రూ.లక్ష, 21 మంది ప్రతిభావంతులకు నగదు బహుమతులు, రాష్ట్రవ్యాప్తంగా ఎంపికయ్యే వెయ్యి మంది అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు వెల్లడించారు. అదనంగా మెరిట్ ఆధారంగా కోచింగ్‌లో రాయితీలు, ఉచిత మెటీరియల్, ఇతర ప్రోత్సాహకాలు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ స్కాలర్‌షిప్ టెస్ట్ ఈ నెల 28న ఉదయం 10:00 గంటలకు వాగ్దేవి జూనియర్ కళాశాల బజాజ్ షోరూం దగ్గర ముస్తాబాద్ రోడ్డు దుబ్బాక , స్నేహ జూనియర్ , డిగ్రీ కళాశాల రామాయంపేట కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు సమీప పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసుకుని ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 76808 87711, 76808 87722 నెంబర్లకు సంప్రదించగలరన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్ రాజ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు దాతర్ పల్లి భాస్కర్, రాంపల్లి సతీష్, పోతరాజు శ్రీనివాస్, ప్రవీణ్, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవీఆర్ కరాటే అకాడమి



**దశ, హైదరాబాద్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో శుక్రవారం కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమీ లో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. కరాటే మాస్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి కరాటే విద్యార్థులైన భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియాలతో కలిసి ఈ రికార్డు చేశారు. 36 సెకండ్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్స్ను చేతితో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డు చేసిన గోపాల్ రెడ్డి తో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ను అందజేశారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత తదితరులు పాల్గొని రికార్డు గ్రహీతలు అభినందించి సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్ ద్వారా బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేవలం 36 సెకన్లలో అత్యంత క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలతో ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డిని అభినందించారు. ప్రపంచ రికార్డులు కేవలం ప్రతిభను ప్రదర్శించడానికి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు.

అలాగే ఈ రికార్డులో పాల్గొన్న భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ లను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ధైర్యం, విశ్వాసం, క్రమశిక్షణ ఈ ప్రపంచ రికార్డు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు జివిఆర్ కరాటే అకాడమీ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, మాజీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణా రెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మరియు విద్యార్థులను అభినందించారు. ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జివిఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.



## ఈ నెల 29న కోటమైసమ్మ ఆలయంలో వేలం పాటలు

**దశ, కారేపల్లి:** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో ఏడాది కాల పరిమితితో టెంట్ సామను అద్దెకు ఇవ్వడానికి, కొబ్బరి చిప్పల పోగుకు వేలం పాటను ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పర్స పట్టాభి రామారావు, ఈవో కె.వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేది నుండి 31జూన్ 2027 కాల పరిమితితో కోట మైసమ్మ తల్లి ఆలయ పరిసరాలలో టెంట్ సామనుల నిర్వహణ, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెంట్ హౌస్ నిర్వాహణ కోసం రూ.1 లక్ష, కొబ్బరి చిప్పల కోసం రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. కొబ్బరి చిప్పల పోగుకు జాతర నిర్వాహక కాలంలో 20 రోజులు పాటు అవకాశం ఉండదని ఆ సమయంలో వేరే టెండర్ అమలులో ఉంటుందని తెలిపారు.

## స్నానానికి వెళ్లి ఉరివేసుకున్న యువతి

❖ *హయత్‌నగర్‌లో విషాదం.. డిగ్రీ విద్యార్థిని మేఘన అనుమానాస్పద మృతి*



**దశ, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న ఓ యువతి ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌లోని శివం హిల్స్ కాలనీకి చెందిన మేఘన (21) మెహదీపట్నంలోని సెయింట్ ఆంటోనీ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. శుక్రవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో స్నానం చేస్తానని చెప్పి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుంది. గంటకుపైగా గడిచినా బయటకు రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పలుమార్లు తలుపు తట్టినా స్పందన రాలేదు. అనుమానం వచ్చిన వారు బెడ్‌రూమ్ కిటికీ అద్దాన్ని పగులగొట్టి చూడగా, మేఘన సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తలుపు బద్దలు కొట్టి ఆమెను కిందకు దించి హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మేఘన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మేఘన మృతికి గల కారణాలు తెలియరాలేదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె తండ్రి కౌకుంట్ల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

కాగా, మేఘన తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె కావడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్సై రామన్ గౌడ్



**దశ, చిన్నంబావి:** చిన్నంబావి మండల కేంద్రంలో ఎస్సై రామన్ గౌడ్ ఆధ్వర్యంలో వివేకానంద స్కూల్ విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలు, వ్యసనాలకు వ్యతిరేకంగా శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలంటూ నినాదాలు చేస్తూ గ్రామంలోని ముఖ్య వీధుల గుండా ఈ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎస్సై రామన్ గౌడ్ మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుమందులు, సిగరెట్లు, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనమవ్వడమే కాకుండా ప్రాణాలకే ముప్పు వస్తుందని హెచ్చరించారు. విద్యార్థుల ఇళ్లల్లో తల్లిదండ్రులు లేదా పెద్దలు ఎవరైనా మత్తు పదార్థాలు, ధూమపానం, మద్యపానానికి అలవాటు పడి ఉంటే.. వాటి వల్ల జరిగే నష్టాలను పిల్లలు వారికి వివరించాలని సూచించారు. ఈ అవగాహన ర్యాలీని ఉద్దేశించి వివేకానంద స్కూల్ ప్రధానోపాధ్యాయులు లింగస్వామి మాట్లాడుతూ..

సమాజంలో పెచ్చురిల్లుతున్న మత్తు సంస్కృతిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొప్పునూరులో ఇంటింటికీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

**దశ, చిన్నంబావి:** చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ బీచ్ పల్లి యాదవ్, కొప్పునూరు గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్నలు ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంపిణీని వేగవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సర్వే బాధ్యతలను స్థానిక అంగన్వాడీ టీచర్లు, ఆయా పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బీఎల్ఓ అప్పగించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ.. ఓటరుకు ఒకవేళ 2002 నాటి ఓటు ఉన్నట్లయితే, అక్కడ అతని పాత 2002 లిస్ట్ ప్రకారమే వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో బాధ్యత కలిగిన వ్యక్తికి ఈ ఫారం కాపీని అందజేసి, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. అలా పూర్తి చేసిన వివరాలను నిర్ణీత గడువులోపు అంగన్వాడీ టీచర్‌కు లేదా బీఎల్ఓకు సమర్పించాలని అంగన్వాడీ టీచర్లు ఎండి. ఖాజా భాను, జి. లక్ష్మిలు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అగ్గన్నగారి సుదర్శన్ రెడ్డి, ఒకటో వార్డు సభ్యుడు తగరం శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బాలు యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు మేడిపల్లి ఇంద్రసేనారెడ్డి, పుల్లారెడ్డి, హైపు రెడ్డి, బంకుమీది చక్రధర్ రెడ్డి, తగరం కాన్షిరామ్, తగరం నాగరాజు, తగరం చిన్న కురుమయ్య, పసుల భరత్ యాదవ్, ఆటో షర్ఫుద్దీన్, వడ్డేమాన్ కుర్మయ్య, సయ్యద్ మక్బుల్ బాషా, ఫీల్డ్ అసిస్టెంట్ కత్తి కురుమూర్తి, కత్తి జానీ, స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సారపాకలో కొరవడిన పారిశుద్ధ్య నిర్వహణ




**దశ, బూర్గంపహాడ్:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని ప్రముఖ పారిశ్రామిక ప్రాంతమైన సారపాక మేజర్ పంచాయతీలో ప్రజాపాలన కాస్తా 'చెత్త' పాలనగా మారిందని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఇక్కడి యువ సర్పంచ్ ప్రజా సమస్యల పరిష్కారంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తుండగా, మరోవైపు బదిలీపై వచ్చిన కొత్త పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి నిత్యం వందలాది మంది భక్తులు, పర్యాటకులు, ప్రయాణికులు భద్రాచలంసారపాక బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఈ జాతీయ రహదారి పక్కనే ఆటోల్లో తెచ్చి చెత్తను ఇష్టారాజ్యంగా పారబోస్తుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఇది ఇటు భక్తులకు, అటు స్థానిక ప్రజలకు తీవ్ర అనారోగ్య హేతువుగా మారుతోందని పలువురు మండిపడుతున్నారు. అలాగే ప్రసిద్ధ ఐటీసీ కర్మాగారానికి వెళ్లే రహదారి మధ్యలో ఉన్న డివైడర్లలో సైతం చెత్తాచెదారం భారీగా పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది.

### దోమల వ్యాప్తి..

మేజర్ పంచాయతీ పరిధిలోని ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు, డ్రైనేజీల్లో నిల్వ ఉన్న మురుగునీరే కనిపిస్తోంది. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల పల్లె ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం ద్వారా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ.. సారపాక మేజర్ పంచాయతీలో మాత్రం ఆ ఊసే లేదని, అసలు పల్లె ప్రగతి ఇక్కడ అమలైనట్లుగా ఎక్కడా కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



# అంగన్వాడీ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలి: సీతా మహాలక్ష్మి




**దశ,మణుగూరు:** అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీతా మహాలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం మణుగూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన మణుగూరు ప్రాజెక్ట్ అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.18 వేల వేతనం హామీని వెంటనే అమలు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లకు రూ.18 వేల వేతనం అమలు చేయడంతో పాటు ప్రమోషన్‌కు అర్హులైన ఆయాలకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ సిబ్బందిపై మోపుతున్న అదనపు పనిభారాన్ని తొలగించాలని, బి ఎల్ ఓ,SIR ఎన్నికల విధుల్లో 50 సంవత్సరాలు దాటిన టీచర్లు, ఆరోగ్య సమస్యలు ఉన్న సిబ్బంది, ఆయాలు లేని కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన సేవలకు ఆటంకం కలగకుండా అంగన్వాడీ కేంద్రాల సాధారణ కార్యకలాపాలు కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని, ప్రతి కార్యకర్త ఐక్యంగా పోరాటాల్లో పాల్గొనాలని సీతా మహాలక్ష్మి పిలుపునిచ్చారు.

సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సరెండి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వేరుపుల మల్లికార్జున్, దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, మండల నాయకులు రాయల బిక్షం, తోట రమేష్, మాజీ ఎంపీపీ ఎడారి, ఎస్కే సర్వర్, బి. సంపత్, ఆర్. రాములు, అంగన్వాడీ నాయకులు పోడం విజయకుమారి, మడకం అరుణకుమారి, భూక్య విజయకుమారి, కేఎంవీ రాణి, చంద మంగమ్మ, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగు కుమారి, గన్నెబోయిన సుజాత, సోడే వెంకటరమణ, నక్క ఈశ్వరమ్మ, మడి లీలావతి ఏఐటీయూసీలో చేరగా, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సీతా మహాలక్ష్మి వారికి ఏఐటీయూసీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.




# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**దశ,మణుగూరు :** అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మణుగూరులో నిర్వహించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు సమాజానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం గుర్తిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇందిరమ్మ గృహ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో టియుడబ్ల్యూజే జిల్లా, పినపాక నియోజకవర్గ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా ఓటర్ జాబితా సవరణ..

❖ *ఐ టి డి ఏ పి ఓ రాహుల్..*



**దశ బూర్గంపాడు:** భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా పారదర్శకత కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించాలని ఐటీడీపీఓ రావులన్నారు . ఈ నేపథ్యంలో ప్రక్రియ ప్రారంభమైనందున బి ఎల్ వో లు, సూపర్వైజర్లు అందించిన ఎన్యుమరేషన్ ఫారంలలో ఓటర్లు తమ పూర్తి వివరాలు నమోదు చేసి బి ఎల్ ఓ సూపర్వైజర్లకు అందించాలని 110( ఎస్ టి) పినపాక నియోజకవర్గం ఈ ఆర్ ఓ లకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఓటర్లకు సూచించారు. శుక్రవారం బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు 233,వీరవెండి191, మోతే 189 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు సంబంధిత ఓటర్లకు అందించి ఓటర్లకు పలు సూచనలు అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ అంటే కేవలం ఓటర్ల జాబితా సవరణ మాత్రమే అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడానికి మరియు జాబితాలోని తప్పులను సరిదిద్దడం దీని ముఖ్య ఉద్దేశం అని, ఓటర్లు బిఎల్వోలు మరియు సూపర్వైజర్లు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకొని కుటుంబంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పూర్తిస్థాయి వివరాలు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయించి తిరిగి బిఎల్ఓలకి అందించినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని అన్నారు. సంబంధిత ఓటర్లు సర్ ఓటర్ జాబిత ప్రక్రియలో ఓటు నమోదు చేయించుకోవడానికి ఎటువంటి అనుమానాలు, భయాందోళనలు పెట్టుకోవద్దని, ఈ సర్వే ద్వారా మరణించిన వారి పేర్లు వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు మరియు ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లను తొలగిస్తారని,

ఇంటింటి సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు నేరుగా ప్రతి ఓటరు ఇంటికి వచ్చి వివరాలను వెరిఫై చేస్తారని, ఇది కేవలం ఓట్ల సవరణ ప్రక్రియ మాత్రమేనని, అర్హులైన వారి ఓట్లను ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించబోరని, అందుకు బి ఎల్ వో లకు సంబంధిత ఇంటి యజమానులు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారంలో మీ ఇంటిలోని సభ్యుల అర్హులైన వారి అందరి వివరాలను అందించి సహకరించాలని అన్నారు.అనంతరం బిఎల్ఓ లకి, సూపర్వైజర్లకి సూచనలు ఇస్తూ ప్రతి ఇంటింటికి తిరిగి తప్పనిసరిగా ఇంటి సభ్యుల పూర్తి వివరాలు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, బిఎల్వోలు పద్మ, దీపిక, శ్రీలక్ష్మి, మేరీ, చందు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం టెంపుల్ కారిడార్‌కు కేంద్రం అండ: బిజెపి

❖ *98 కోట్ల నిధులు సద్వినియోగం చేయని ఆనాటి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు*

❖ *త్వరలో పాండురంగాపురం వరకు నూతన రైల్వే నిర్మాణం*



**దశ, బూర్గంపాడు:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కారిడార్ అభివృద్ధిపై బీజేపీ నేతలు సారపాక లోని బిజెపి నేత కన్నదారి ప్రసాద్ స్వగృహం లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నేత ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, భద్రాచలం టెంపుల్ అభివృద్ధికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. 2020 22 సంవత్సరంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం రూ.98 కోట్లుమంజూరు చేసిందని గుర్తు చేశారు. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సరిగా వినియోగించుకోలేదని ఆరోపించారు.

ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి భద్రాచలం టెంపుల్ అభివృద్ధి కోసం రూ.350 కోట్లతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కేంద్రం ఇప్పటికే మంజూరు చేసిన రూ.98 కోట్లను కూడా కలుపుకొని భద్రాచలం ఆలయాన్ని జాతీయ స్థాయి యాత్రా కేంద్రంగా తీర్చిద్దాలని డిమాండ్ చేశారు.

**నూతన రైల్వే లైన్:**
నాలుగు రాష్ట్రాలను కలుపుతూ భద్రాచలం నుండి పాండురంగాపురం వరకు కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలి. దీనివల్ల యాత్రికుల రాకపోకలు సులభతరమవుతాయని అన్నారు.


**ఈఎస్ఐ హాస్పిటల్:** జిల్లాలో సింగరేణి, ఐటిసి బిటిపిఎస్ వంటి భారీ పరిశ్రమలు ఉన్నాయి. వేలాది కార్మికులు పని చేస్తున్నారు. వారి ఆరోగ్య సంరక్షణ కోసం ఆయా ప్రాంతాల్లో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కార్మిక సంక్షేమం:** పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలి. వసతి, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

**నేషనల్ హైవే:** భద్రాచలం కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు నేషనల్ హైవే నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, డివిజన్ స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలిమ్ సెన్సార్ బోర్డు మెంబర్ కన్నెదారి వరప్రసాద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంజా ధర్మ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గూగులోతు బాలు నాయక్ జిల్లా నాయకులు బిజ్జం శ్రీనివాస్ రెడ్డి కుంజా సంతోష్ చుక్కపల్లి బాలాజీ కేసు గాని శ్రీనివాస్‌గౌడ్‌నాగబాబువైవెంకటేశ్వరరావు ఓరుగంటి సురేష్ శ్రీనివాస్‌రెడ్డి జాదవుల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# 108 అందక ఆటోలోనే ప్రసవం

❖ *గిరిజన ప్రాంత వైద్య సేవలపై ప్రశ్నలు*



**దశ, పినపాక :** మండలంలోని అమరారం గ్రామంలో గర్భిణికి ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో అందక ఆటోలోనే ప్రసవం జరగడం గ్రామీణ వైద్య వ్యవస్థలోని లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. అమరారం గ్రామానికి చెందిన కలివేటి సంధ్యకు అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అయితే అంబులెన్స్ అందుబాటులోకి రాకపోవడంతో ఆటోలో జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే ఆ పీహెచ్‌సీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పనిచేయడంతో రాత్రివేళ వైద్య సేవలు అందుబాటులో లేకపోయాయి. దీంతో గర్భిణిని పినపాక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ఆటోలో ప్రసవం జరిగింది. ప్రసవం అనంతరం తీవ్ర రక్తస్రావం కావడంతో తల్లి, శిశువును 108 అంబులెన్స్ ద్వారా మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జానంపేట పీహెచ్‌సీలో మూడు వైద్యుల పోస్టులు మంజూరై ఉండగా ప్రస్తుతం ఒక్క వైద్యుడే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒక వైద్యుడు పీజీ చదువుల కోసం వెళ్లగా, మరొకరు డిప్యుటేషన్‌పై ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ ప్రాంతానికి కేటాయించిన 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గిరిజన, మారుమూల ప్రాంతాల్లో 24 గంటల అత్యవసర వైద్య సేవలు, వైద్యుల నియామకం, 108 అంబులెన్స్ సేవలను పటిష్ఠం చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటన గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో ఉన్న లోపాలను తక్షణమే సరిదిద్దాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దర్శించుకున్న ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజి రెడ్డి



**దశ, భద్రాచలం:** బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను సమర్పించారు.దర్శనం అనంతరం సారపాకలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు, పట్టభద్రుల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల కల్పన, రాష్ట్ర అభివృద్ధి తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, బోడ సత్యనారాయణ, ట్రిపుల్ ఎక్స్ చక్రవర్తి, పాండు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# జానంపేట నిధుల గోల్‌మాల్‌పై హై లెవల్ కమిటీతో విచారణ జరపాలి: సీపీఐ, టీడీపీ



**దశ,పినపాక:** జానంపేట గ్రామపంచాయతీలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నిధుల అవకతవకలపై జిల్లా కలెక్టర్ స్పందించి హై లెవల్ అధికారుల కమిటీతో సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ, టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జానంపేటలో జరిగిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్, టీడీపీ నాయకుడు మేదరమెట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పర ఆరోపణలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. 2018 నుంచి ఇప్పటి వరకు పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులు, నిధుల వ్యయంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు ప్రజలకు వెల్లడించాలని కోరారు. అధికార, ~~ప్రతిపక్ష పార్టీలు నిజాయితీగా ఉంటే అఖిలపక్షంగా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం~~ అందజేద్దామని సవాల్ విసిరారు. సమావేశంలో ధర్మరాజుల శంకర్‌తో పాటు సీపీఐ, టీడీపీ నాయకులు ఐలన్న, సాంబయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యూజే (ఐజేయు) పినపాక నూతన డివిజన్ కమిటీ ఎన్నిక

❖ *అధ్యక్ష, కార్యదర్శులుగా పిండిగా వెంకట్, బర్ల జోషి*



**దశ, మణుగూరు :** టియుడబ్ల్యూజే (ఐజేయు) ప్రింట్ మీడియా పినపాక నూతన డివిజన్ కమిటీని, జాతీయ కౌన్సిల్ సభ్యులు బివి రమణ రెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జానుమాల రమేష్ లను శుక్రవారం మణుగూరు డీవీ ఫంక్షన్ హాల్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పినపాక డివిజన్ అధ్యక్షులుగా పిండిగా వెంకట్ (వార్త), కార్యదర్శి బర్ల జోషి (ప్రజాపక్షం), ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి (సాక్షి), యడారి శివరామకృష్ణ (తెలంగాణ వాణి), తిప్పని శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), గౌరవ సలహాదారులుగా వంగూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా సనప భరత్ (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శి కనుకు రమేష్ (భారతశక్తి), కమిటీ సభ్యులుగా శ్రీరామ్ బృహస్పతి (నవతెలంగాణ), కొల్లు నాగేశ్వరరావు (మెట్రో ఈవినింగ్), పి. నర్సింహారెడ్డి (మన భద్రాద్రి), అంజం యాకన్న (విశాలాంధ్ర), నక్క సురేష్ (మీడియా టుడే), వుల్లోజు బాబూరావు (దిశ), జిల్లపల్లి ఓం ప్రకాష్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా కార్యవర్గ సభ్యులు పూజారి చందు ప్రకటించారు.

**ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కమిటీ**
అధ్యక్షులుగా పంపన రమేష్ (10టివి), కార్యదర్శి జిన్నె ఉపేందర్ (రాజ్ న్యూస్), కోశాధికారి రవి కిరణ్ (ఐ న్యూస్), సహాయ కార్యదర్శి మర్రి సాంబిరెడ్డి (ప్రైమ్ 9 న్యూస్), ఆర్గనైజింగ్ సభ్యులు గుర్రం రవి (హెచ్‌ఎమ్ టివి), దాసరి వెంకట్ (బిగ్ టివి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఆదివాసీ యువతతో మైపతి అరుణ్ కుమార్ 'మాట–ముచ్చట'



**దశ,పినపాక :** మండలంలోని జానంపేటలో ఈ నెల 28న ఆదివాసీ యువతతో 'మాట-ముచ్చట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ తెలిపారు. నాగులమ్మ ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆదివాసీ యువత సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణ, చట్టాల అమలు తదితర అంశాలపై ఆయన యువతతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివాసీ గూడాలకు చెందిన యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.